నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | 13 ఆగస్టు, 2024 | www.navatelangana.com

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఎటువంటి తప్పులు లేని వార్డుల వారీగా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాను తయారు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం పట్టణంలోని జెడ్పి సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రోజులలో నిరంతర ప్రక్రియగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి సానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు యధావిధిగా జరిగే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీంద్ర, ఎంపీడీఓలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన డీఏఓ

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. ఎరువుల దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎప్పటికప్పుడు ఎరువుల దుకాణాల్లో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, అధిక ధరలకు అమ్మితే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు. అనంతరం కమాన గ్రామంలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయిల్ ఫామ్ పంట మంచి భవిష్యత్తు ఉన్న పంట అని, రైతులు ఈ పంటను సాగు చేస్తే లాభం వస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మిలింద్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి



నవతెలంగాణ-తాంసి

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని విద్య వనరుల కార్యాలయంలో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అమరులైన ఉద్యోగులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమరులైన సమగ్ర శిక్ష ఉద్యోగులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, 61 సంవత్సరాలు నిండి తొలగించిన ఉద్యోగులకు వెంటనే రిటైర్మెంట్స్ బెనిఫిట్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయిని పార్థసారథి, జానకొండ స్వామి, పసి రాకేష్, ఒడ్డి భోజన్న, కన్నక్ గణేష్, నిమ్మల రాజేశ్వర్, తొగరి సురేందర్, రాగి సంజీవ్, మాడ ప్రభావతి పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో సోమవారం కస్తూర్బా గాంధీ బాలిక ఆశ్రమ పాఠశాల, కళాశాలలో మధ్యాహ్న భోజన సమయంలో రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీలలో విధి నిర్వహణలో మరణించిన మహిళా ఉద్యోగినులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఓ రజిత మాట్లాడుతూ శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేని కారణంగా, చాలీచాలని వేతనాలు, మానసిక ఒత్తిడితో నిరాశ, నిస్పృహలకులోనై గుండెపోటు, ఇతర అనారోగ్య కారణాలతో నెలకు ఇద్దరి చొప్పున మరణిస్తున్నారన్నారు. వెంటనే భద్రత కల్పించాలని, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, మరణించిన ఉద్యోగులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలి

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పారిశుద్ధపై ప్రత్యేక దృష్టి సాధించాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని పంచాయితీ రాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ, గృహనిర్మాణ శాఖ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క (అనసూయ) అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి సీతక్క పారిశుద్ధంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనికి కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ పాల్గొన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం ప్రత్యేక 5 రోజుల కార్యక్రమంలో చేపట్టిన పారిశుద్ధ పనుల ప్రగతిపై సమీక్షించుకుని ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై, వరదలు, విష జ్వరాలు హాస్టల్స్ స్కూల్‌లలో సమస్యలు, మిషన్ భగీరథ, వైద్యం మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్‌వాడీ కేంద్రాలపై మంత్రి సమీక్షించారు. మహిళ శిశుసంక్షేమ ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారం, గుడ్లు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యమైన ఆహారం అందించాలని, కుళ్లిపోయిన గుడ్లు తీసుకోకుండా, నాణ్యమైన గుడ్లు తీసుకునేలా సూపర్‌వైజర్ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారులుగా నియమించిన అధికారులు ప్రతిరోజు ఫీల్డ్‌కి వెళ్లాలని పట్టణాలలో గ్రామాల్లో పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించి, వ్యాధులు రాకుండా చూడాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం ప్రతి నెల జరగాలని, డెంగ్యూ, మలేరియా, వ్యాధులు దోమలు, ఈగలు రాకుండా గ్రామాల్లో పట్టణాలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అధికారులు మార్నింగ్ వాక్ వెళ్లకుండా ప్రతిరోజు ఉదయం గ్రామాలలో పర్యటించి అక్కడి గ్రామపరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అన్నారు. హాస్టల్స్ వార్డెన్‌లతో మీటింగ్ ఏర్పాటు చేయాలని హాస్టల్స్‌లో స్ప్రే చేయడం పరిసరాలు శుభ్రంగా ఉంచడం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా పాములు, తెళ్ళు రాకుండా చుట్టుపక్కల శుభ్రం చేయించుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి శ్రమదానం చేయాలని, వంటగది శుభ్రం చేసుకోవాలనీ, వర్షాకాలం వెళ్లే వరకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లాను ప్రగతిపథంలో నిలుపుతూ ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు.

వ్యాపారం, సమాజ సేవ ముసుగులో

- గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలో అరటి పండ్ల వ్యాపారం ముసుగులో గంజాయి అమ్ముతున్న వ్యక్తి ఒకరు.. సమాజ సేవ ముసుగులో మరొకరిని పట్టణ పోలీసులు అరెస్టు అరెస్టు చేశారు. సోమవారం డీఎస్పీ గంగారెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 11న ఉదయం ముందస్తు సమాచారం ప్రకారం పట్టణ ఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి మార్కెట్ కమిటీ సమీపంలో ఉండగా సయ్యద్ అహ్మద్ (అరటి పండ్ల వ్యాపారి) ఒక ప్లాస్టిక్ కవర్‌లో 450 గ్రాముల విడి గంజాయి తీసుకొని కస్టమర్లకు అమ్మడానికి వెళ్తుండగా పట్టుకున్నారు. ఆయనను విచారించగా అబ్దుల్ ముక్తార్ వద్ద కొని తన వినియోగదారులకు అమ్ముతున్నానని తెలిపారు. అబ్దుల్ ముక్తార్ బంగాల్‌పేట్ చెరువులో ఆత్మహత్యలు చేసుకున్న వారి శవాలను వెలికి తీస్తూ సమాజ సేవ చేస్తున్నట్లు నటించేవాడు. ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ డీఎస్పీ గంగారెడ్డి సూచనలతో సయ్యద్ అహ్మద్‌తో పాటు వెళ్లి బస్టాండ్ వెనుకాల ఉన్న అబ్దుల్ ముక్తార్‌ను పట్టుకొని అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. అతను మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపాడు. ఇద్దరి వద్ద నుండి సుమారు 1.5కేజీల గంజాయి స్వాధీనపరచుకొని ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. చాకచక్యంగా వీరిని పట్టుకున్న పోలీసులను ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

తపాల సేవలపై అవగాన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో హెడ్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెడ్ పోస్ట్ మాస్టర్ గంగాధర్, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ కుమార్ విద్యార్థులకు వివిధ రకాల ఖాతాలను, బ్యాంకింగ్ సేవలను తెలియజేశారు. అకౌంట్ ఓపెనింగ్ వివిధ రకాల ఖాతాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చంద్రకాంత్, ప్రతాప్ విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు బహుమతి ప్రధానం

అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్ఓ నిర్వహించిన ఎయిడ్స్ నాటక ప్రదర్శనలో ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభకు బహుమతి ప్రధానం చేశారు. ఇటీవల నిర్వహించిన నాటక ప్రదర్శనలో కళాశాల విద్యార్థులు చేసిన నాటిక అందరిని అబ్బురపరిచింది. ఈ నేపథ్యంలో సోమవారం వారికి బహుమతితో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ అతిక్ బేగం, సిబ్బంది అభినందించారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ



నవతెలంగాణ-ముథోల్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మినారాయణ అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్ళు, నిధులు, నియామకాల కోసమని, అలాంటిది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ వేసి నియామకాలు చేపడతామని చెప్పారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి అది పూర్తి స్థాయిలో అమలు కావడం లేదన్నారు. చాలా మంది రైతుల రుణాలు మాఫీ కాలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం ముథోల్ ఎమ్మెల్యే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు నర్సాగౌడ్, సాంప్లీ రమేష్, మోహన్‌రెడ్డి, తాటివార్ రమేష్, ధర్మపురి సుదర్శన్, భూమన్న, భూమేష్, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

దిగొచ్చిన అధికారులు

- నవతెలంగాణ కథనానికి స్పందన
- జ్వర పీడితులతో మాట్లాడిన డీఎంహెచ్ఓ



జ్వరంతో మృతి చెందిన కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు



వైద్యం చేయొద్దని ఆర్ఎంపీకి ఆదేశిస్తున్న డీఎంహెచ్ఓ తుకారాం భట్

నవతెలంగాణ-కౌటాల

విష జ్వరాలు విజృంభించాయని నవతెలంగాణలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కుమురం భీం-ఆసిఫాబాద్ కలెక్టర్ ఆదేశాలతో సోమవారం మండలంలోని గుండాయిపేట్ గ్రామంలో డీఎంహెచ్ఓ తుకారాం భట్, డీపీఓ బిక్షపతి గౌడ్, ఆర్డీఓ సురేష్‌తో కలిసి ఇంటింటికి తిరిగారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలను సేకరించి జిల్లా ల్యాబ్‌కు పంపించారు. ఆర్ఎంపీ దవాఖాలను సందర్శించారు. ఇక చాలు మీ వైద్యమని ఎంతవరకు పర్మిషన్ ఉంది, మీరు ఏమేమి ట్రీట్మెంట్ చేస్తున్నారు. మీ స్థాయి మరచి ఇష్టారీతిన ట్రీట్మెంట్ చేయడం పద్ధతి కాదు, ఇంజెక్షన్‌లు, సిలైన్లు, పెయిన్ కిల్లర్‌లు ఇవ్వాలంటే దానికి తగిన పరిజ్ఞానం ఉండాలని, ఊర్లో చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక మీరు క్లినిక్‌లు, ట్రీట్మెంట్ ఆపండి అంటూ ఆర్ఎంపీలను హెచ్చరించారు. మళ్ళీ చెప్పేదాకా ఆదేశాలు ఇచ్చేదాకా ఎవరూ ట్రీట్మెంట్ చేయొద్దన్నారు. రెండు రోజుల కిందట గుండాయి పేట్‌లో జాడే పూజ (16), భోయర్ కాళిదాస్ (32) మృతి చెందిన నేపథ్యంలో నష్ట నివారణ చర్యలు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయితీ ఆఫీస్ లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. జ్వరాలు, కీళ్ల కాళ్ళ నొప్పులతో బాధపడేవారి బ్లడ్ శాంపిల్స్ తీసుకున్నారు. వీటిని జిల్లా కేంద్రం లోని టీ హబ్ కు పంపించారు.

ఆర్ఎంపీ దగ్గర ఎక్స్‌పైరీ సిరప్

గ్రామంలో ఇటీవల జ్వరాలు, ఇతర వ్యాధులు రాగా స్థానిక ఆర్ఎంపీలు ట్రీట్మెంట్ ఇష్టారాజ్యంగా చేశారని గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్ఓ, ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఇదే సమయంలో అసలు ఎక్కడ సమస్య ఉత్పన్నం జరుగుతోంది తెలుసుకునేందుకు అధికారుల బృందం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గ్రామంలోని ఆర్ఎంపీల దగ్గరకు వెళ్ళి చికిత్సల గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జీడీ అనే ఆర్ఎంపీ క్లినిక్‌లో తనిఖీ చేయగా అందులో రెండు సిరప్‌లు నాలుగు నెలల క్రితమే వాటి గడువు ముగిసినవిగా గుర్తించారు. అదేవిధంగా క్లినిక్‌లో ఆయుర్వేదం, అలోపతి, హోమియో మందులు ఉండడం గమనార్హం. వీటన్నింటినీ మీరే ఇస్తారా అని అడిగితే అవునని ఆర్ఎంపీ సమాధానం ఇచ్చాడు. దీంతో డీఎంహెచ్ఓ తుకారాం భట్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

సర్కార్ దవాఖనాలో వైద్యులుండారు..

సర్కార్ దావాఖనాలో డాక్టర్, స్టాఫ్ లేరు.. ఇప్పుడు ఆర్ఎంపీ దవాఖానలు కూడా మూసివేస్తే రోగం వస్తే ఎక్కడి వెళ్లాలని డీఎంహెచ్ఓను గ్రామస్తులు నిలదీశారు. ప్రభుత్వ దవాఖానాలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉంటే తాము ఎందు ఆర్ఎంపీ, ప్రయివేట్‌కు వెళ్తామని ఆయన దృష్టికి తెచ్చారు. పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి వ్యాధులు నయం అయ్యేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు డీఎంహెచ్ఓ భరోసా కల్పించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

జ్వరాలతో మృతి చెందిన రెండు కుటుంబాలను అధికారుల బృందం పరామర్శించింది. వ్యాధులను అదుపు చేయడానికి పూర్తి కృషి చేస్తామన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మహాత్మాజ్యోతి బాపూలే గురుకులం తరలించం

నవతెలంగాణ-ముథోల్



ముథోల్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఎట్టి పరిస్థితుల్లో తరలించమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. అద్దె గదులు కావటంతో వసతులు సరిపోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే వెంటనే బిల్డింగ్ యాజమాని పోతన్న యాదవ్‌తో మాట్లాడారు. చిన్నచిన్న మరమ్మతులు చేయాలని సూచించారు. వసతులు లేకపోవటంతో ఇంటర్ కళాశాల నిర్మల్‌కు తరలించిన విషయం ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. దీంతో వెంటనే ప్రక్కన ఖాళీగా ఉన్న బిల్డింగ్ గురించి యాజమానితో ఎమ్మెల్యే మాట్లాడి ఒప్పించారు. దీంతో ఒక్క బిల్డింగ్‌లో హాస్టల్, మరో బిల్డింగ్‌లో విద్యానందించాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్సీఓ గోపిచంద్‌కు సూచించారు. వెంటనే ఇంటర్ కళాశాలను ముథోల్‌కు తరలించాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఆయన వేంట బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు సాంప్లీ రమేష్, శ్రీనివాస్, సప్పటోల్ల పోతన్న సతీష్ రెడ్డి, తాటివర్ రమేష్ ఉన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఆర్జేడీ విచారణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కొన్ని రోజులు నెలకొన్న పారిశుద్ధ కార్మికుల వివాదం పరిష్కారానికై వరంగల్ ఆర్జేడీ షాహిద్ మసూద్ సోమవారం కార్యాలయంలో విచారణ చేపట్టారు. నాలుగు నెలలుగా రావాల్సిన వేతనాలతో పాటూ పెండింగ్‌లో ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలని కోరుతూ కార్మికులు సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయానికి చేరుకున్న ఆర్జేడీ కమిషనర్ అంజయ్యతో పాటూ పాలకవర్గ సభ్యులతో బేటి అయ్యారు. పలు రికార్డులను పరిశీలించినంతరం కార్మికులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, సమ్మె విరమించాలని కోరగా జీతాలు ఖాతాల్లో జమచేసే వరకు సమ్మె విరమించబోమని కార్మికులు తేల్చి చెప్పారు. ఇప్పటికే మంత్రి సీతక్కకు సమస్యను విన్నవించామని, త్వరలోనే సీఎంను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ దసగర్, పాలకవర్గ సభ్యులు కార్మికులతో చెప్పినప్పటికీ కార్మికులు సమ్మె కొనసాగిస్తామన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మద్దతు తెలిపారు. మున్సిపల్ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని, సమస్య పరిష్కారం అయ్యే వరకు కార్మికులకు అండగా ఉంటామన్నారు.

వాంకిడి ఎస్ఐగా ప్రశాంత్

నవతెలంగాణ-వాంకిడి

మండల నూతన ఎస్ఐగా ప్రశాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన సాగర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానన్నారు.

విద్యావాలంటీర్లను నియమించాలి

- కలెక్టర్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల స్థానాల్లో విద్యా వాలంటీర్లను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల, ప్రమోషన్‌ల ప్రక్రియ అనంతరం జిల్లాలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. దీని వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. చాలా మంది ఉపాధ్యాయులు బదిలీ పొందినప్పటికీ ఇంకా పాత స్థానంలోనే కొందరు కొనసాగుతున్నారని పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా నియమకాలు చేపట్టిన కూడా ఇంకా జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉంటుందని తెలిపారు. నవంబర్ నెలలో నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష సన్నద్ధతకు ఈ ఉపాధ్యాయ కొరత తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. తమకు ఉన్న సమాచారం ప్రకారం జిల్లాలో అన్ని క్యాడర్లు కలిపి దాదాపు 550 వరకు ఉపాధ్యాయ ఖాళీలున్నాయని తెలిపారు. డీఎస్సీ ద్వారా 300 వరకు నియామకాలు చేపట్టిన కూడా ఇంకా 250 వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర మూడు జిల్లాల కలెక్టర్లు విద్యా వలంటీర్ల నియామకంపై ప్రతిపాదనను పంపి ప్రభుత్వం నుండి అనుమతి పొందారని తెలిపారు. మన జిల్లా విద్య పరిస్థితి దృష్టిలో ఉంచుకొని విద్యా వాలంటరీల అవసరం చాలా ఉందన్నారు. ప్రస్తుతం ఖాళీలలో విద్యా వాలంటీర్లను నియమించాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావ్, కోశాధికారి కిష్టన్న పాల్గొన్నారు.

విద్యాశాఖధికారిపై చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయులపై వ్యక్తిగతంగా కక్షపూరితంగా వ్యవహరిస్తూ మానసిక ఆందోళనకు గురి చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ కోరారు. సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ డీఈఓను పిలిపించి వివరణ కోరారు. నాయకులకు సమయాన్ని కేటాయించి వారి సమస్యను క్షుణ్ణంగా విన్నారు. డీఈఓ విధానంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్పందించిన కలెక్టర్ ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవిని ఆదేశించారు. తమ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నారనే కోపంతో జిల్లా విద్యాశాఖ అధికారి వ్యక్తిగతంగా కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను మానసిక ఆందోళన గురి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఓ ఉపాధ్యాయురాలి స్టేషన్ సర్వీస్ పాయింట్స్‌ను అర్ధరాత్రి (వెబ్ అప్షన్ చివరి రోజు) తగ్గించి కక్షపూరితంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు లేకున్నా తన అవినీతి, అక్రమాలను పదేపదే ప్రశ్నిస్తున్నారన్న కోపంతో సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ భార్య ఉపాధ్యాయురాలు సువర్ణ సర్వీస్ పాయింట్ తగ్గించి సీనియారిటీ జాబితాలో 60 మంది తర్వాత వెనక్కి వెళ్లేలా చేశారని పేర్కొన్నారు. ఈ విషయమై డీఈఓను ప్రశ్నించగా తాను చేయలేదని బుకాయించే సమాధానం చెప్పారని అన్నారు. వెబ్‌అప్షన్ చివరి రోజు అర్ధరాత్రి పూట కంప్యూటర్ ఆపరేటర్‌ను పిలిపించుకొని సర్వీస్ పాయింట్ తగ్గించేలా చర్యకు పూనుకున్నారని అన్నారు. ఈ అంశంపై తగిన సమాచారం కొరకు ఆర్టీఏ ద్వారా అడిగినప్పటికీ 40 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సమాచారం ఇవ్వలేదన్నారు. ఇంతలా కక్షపూరితంగా వ్యవహరించి పాయింట్స్ తగ్గించడం ద్వారా ఉపాధ్యాయురాలికి అన్యాయం చేసిన జిల్లా విద్యాశాఖ అధికారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్, రాష్ట్ర కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రావ్, కోశాధికారి కిష్టన్న పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | 13 ఆగస్టు, 2024 | www.navatelangana.com

సిల్వర్ మెడల్ సాధించిన బత్తుల అశ్విని

నవతెలంగాణ-నిర్మల్



రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించిన మూడవ సబ్ జూనియర్ బాలురు, బాలికల రాష్ట్ర బాక్సింగ్ పోటీలలో హోం గార్డ్ బత్తుల లక్ష్మి కుమార్తె బత్తుల అశ్విని 37-40 కేజీల విభాగంలో సిల్వర్ పతకం సాధించింది. విషయం తెలుసుకున్న ఎస్పీ జానకి ఆమెను అభినందించి భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఢిల్లీలో ఈ నెల 30 నుండి జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనటానికి వెళ్తున్న అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పోలీసు విభాగం తరపున సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు.

లింగి వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో సభావత్ శ్రీనివాస్ నాయక్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రజలకు సేవ చేసేందుకు విజయ శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్‌ని ఏర్పాటుచేసి సేవలందిస్తున్నామని ట్రస్ట్ సభ్యులు కొండ రాజన్న, బాపూరావు అన్నారు. సోమవారం ట్రస్ట్ చైర్మన్ సభావాత్ శ్రీనివాస్ నాయక్ జన్మదిన పురస్కరించుకొని మండలంలోని లింగి వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శేఖర్ రెడ్డి, అడెల్లు, రాజు పాల్గొన్నారు.

ప్రజావాణికి పోటెత్తిన అర్జీదారులు

- 4 గంటల్లో 166 అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- తక్షణమే సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో అర్జీల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను తెలియజేసుందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరాగ కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. గత సోమవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రత్యేక విధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రజావాణి నిర్వహించలేదు. ఆ కారణంగానే నేటి సోమవారం ప్రజావాణికి అర్జీదారులు పోటెత్తారు. కలెక్టర్ దాదాపు 4-5 గంటల పాటు అర్జీదారుల సమస్యలు విని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. వివిధ సమస్యలను అర్జీదారులు విన్నవించగ ఆ శాఖ అధికారిణి పిలిపించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీగా అర్జీదారులు రావడంతో సమావేశ మందిరం ద్వారం వద్ద కాస్త తోపులత జరిగింది. మాకంటే ముందు వచ్చిన వాళ్ళు లోపలికి వెళ్తున్నారు అని అక్కడ ఉన్న సిబ్బందితో కాస్త వాగ్వివాదానికి దిగారు. అనంతరం సముదాయించగా సద్దుమణిగింది. ఫిర్యాదు దారులతో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామనే భరోసాను కల్పించారు. కాగా ఒక్కరోజే ప్రజావాణిలో 166 మంది నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ట్రైనింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలోని మావలలో ఉన్న టీఎల్‌జీ కంపెనీ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ పూర్తయిన తర్వాత జాబులు ఇస్తామని ప్లేస్మెంట్ చూపిస్తామని యాజమాన్యం చాలామంది విద్యార్థులను మోసం చేస్తున్నారని ట్రైనింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతి లేకుండా కోచింగ్ సెంటర్ నడుపుతున్నారని ఆరోపించారు. ఒకరు జాయిన్ అయిన తర్వాత అతను వెళ్ళిపోవాలంటే ఇంకొకరిని జాయిన్ చేయాలి లేకపోతే ఇంటికి పంపమని బెదిరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఉన్నారు.

దుకాణలకు రీ టెండర్ వేయాలి



ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దివ్యాంగులకు కేటాయించిన దుకాణ సముదాయాలకు రీ టెండర్లు వేయాలని వికలాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సలీమ్ కోరారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం. టెండర్లకు సంబంధించిన కాల పరిమితి 2023 సంవత్సరంలో ముగిసిందని తెలిపారు. అలాగే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని దివ్యాంగులకు సంఘ భవనం నిర్మాణం పూర్తి చేయాలన్నారు. నకిలీ సదరం సర్టిఫికెట్‌లు రద్దు చేయలన్నారు. దివ్యాంగులకు లోన్‌లు ప్రతి మండలానికి 20 యూనిట్లు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, ఆర్గనైజర్ రాజశేఖర్, ఇమ్రాన్, రాకేష్ ఉన్నారు.

కాలనీలో సౌకర్యాలు కల్పించండి



తమ కాలనీలో సౌకర్యాలు లేవని కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బంగారిగూడలోని కుమ్మరి కాలనీ కాలనీవాసులు ప్రజావాణికి సోమవారం తరలివచ్చారు. తమ కాలనీలో విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు డ్రైనేజీ సౌకర్యాలు లేవని కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్లు సరిగా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ప్రతిరోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది కరంగా ఉందని విన్నవించారు. తమ కాలానికి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి ఫండ్ రావడం లేదని అన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను పిలిపించి మాట్లాడారు. కాలనీవాసుల సమస్యలను అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సురేష్, మనోజ్, నాందేవ్, రమేష్ ఉన్నారు.

తిరిగి విధుల్లో తీసుకునేలా చర్యలు తీసుకోండి



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసిన పాత పారిశుద్ధ కార్మికులకు తిరిగి విధుల్లో తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలల పారిశుద్ధ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి విన్నవించారు. జిల్లాలో మొత్తం 650 మంది కార్మికులున్నారని గత ప్రభుత్వం విధుల నుండి తమను తొలగించారని తెలిపారు. వేతనాలు తగ్గిస్తూ కార్మికులను దశలవారీగా తొలగించారన్నారు. నూతన ప్రభుత్వం తమను విధుల్లో తీసుకోవాలని జీఓ ఇచ్చిందని జీఓతో పాటు అమ్మ ఆదర్శ కమిటీ కీ ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. కావున తమను విధుల్లో తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముస్కు విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

విద్యావాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోండి



విద్యా వాలంటీర్లను ప్రభుత్వం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ విద్యా వాలంటీర్ల సంఘం అధ్యక్షుడు రామ్ కిషన్ కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ స్థానాలలో వివిధ సేవలను వినియోగించుకుని కరోనా కారణంతో ప్రభుత్వం తమను తొలగించిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యా వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలన్నారు.

పాఠశాలలో ఉపాధ్యాయుల భర్తీ చేపట్టండి



పట్టణంలోని బాలక్ మందిర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సేవా ఫౌండేషన్ ఆదిలాబాద్ అధ్యక్షుడు ఖాజా సిరాజుద్దీన్ అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులను భర్తీ చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ రాజార్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-జైనథ్

తెలంగాణ రాష్ట్రంలో సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న సప్లిమెంటరీ బిల్లులను వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరగంటి అశోక్ డిమాండ్ చేశారు. సభ్యత్వ క్యాంపెయిన్‌లో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన సప్లిమెంటరీ బిల్లులు, జీపీఎఫ్ రుణాలు, టీఎస్ జీఎల్ఐ క్లెయిమ్‌లు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం పెండింగ్ పెట్టిందన్నారు. తమకు రావాల్సిన సొమ్ము కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూసే దయనీయ పరిస్థితిని ఎదుర్కోవడం దారుణమన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించాలని, తక్షణమే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యక్షులు టి సూర్యకుమార్, మండల బాధ్యులు ఎస్.గణేష్, ఎ.ప్రమోద్, జి.రవీందర్ పాల్గొన్నారు.

ఉద్యాన పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కొండా లక్ష్మణ్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో స్పాట్ వాక్ ఇన్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు చేపడుతున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.వి.మురళి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14 నుండి 16వ తేదీలలో అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, పదవ తరగతి మెమో, కుల ధ్రువీకరణ ఆధాయం ఒరిజినల్ సర్టిఫికెట్‌తో కళాశాలలో నిర్వహించే స్పాట్‌కు హాజరుకావాలని సూచించారు. సీటు వచ్చిన వెంటనే ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2 సంవత్సరాలు కోర్సు ఉంటుందని పదవ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 6304749921 నంబరును సంప్రదించాలన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని జామిని ప్రాథమికోన్నత పాఠశాలలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఇటీవలే బదిలీపై వెళ్ళిన తొమ్మిది మంది ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు శాలువ, పూలమాలలతో ఘనంగా వీడ్కోలు చెప్పారు. ప్రాథమికోన్నత పాఠశాలలో తొమ్మిది సంవత్సరాలుగా తొమ్మిది మంది ఉపాధ్యాయులు హరీష్, రాములు, బాదల్, ప్రతాప్ సింగ్, రాజేశ్వర్, అరుణ్ రాజ్, మధావ్, ఉపేందర్‌ల సేవలను గ్రామస్తులు కొనియాడారు. అనంతరం కొత్తగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు జయశ్రీ, జ్యోతి, గంగన్న, పెంటపర్తి ఊశన్నలను సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నైతం దేవుబాయి, మాజీ సర్పంచ్ పెందూర్ మోహన్, ఐటీడీఏ డైరెక్టర్ కూర్సెంగ తానాజీ, గ్రామ యూత్ మెంబర్స్ రాజు, కృష్ణ, సంతోష్, ప్రభాకర్, అవినాష్, ధర్మా జగన్నాథ్ పాల్గొన్నారు.

నేడు జిల్లా బంద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగ్లాదేశ్‌లో హిందువులు, దేవాలయాలు, హిందూ వ్యాపార సంస్థలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 13న మంగళవారం జిల్లా బంద్‌కి పిలుపునిస్తున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్, ట్రేడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమల్ కిషోర్ అగర్వాల్, గంద్రత్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్క వ్యాపారి బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చవిదిన పాఠశాలకు చేయూత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని వరంగల్ జిల్లా తాడ్వాయి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థి ననిగంటి శ్రీకాంత్ రెడ్డి సోమవారం తాను చదువుకున్న పాఠశాలకు తనవంతు సాయం అందించారు. విద్యార్థులకు జనరల్ నాలెడ్జి బుక్స్, ఎక్సామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డితో కలిసి పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సరోజ, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, మధు, సుదర్శన్, సుధారాణి, మహేష్, రమాబాయి, కుసుమ, పూర్వ విద్యార్థి అట్ల దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బీసీ సంక్షేమ అధికారికి సన్మానం



నవతెలంగాణ-నిర్మల్

ఇటీవల నూతనంగా జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కి బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి డా.ఈసవేని మనోజ్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా డా.మనోజ్ యాదవ్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖను ముందుకు తీసుకెళ్లాలన్నారు. యువత ముందుకు రాణించాలని బీసీ సంక్షేమ శాఖ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు నిమ్మ గంగన్న, శ్యామకూర నితీష్, ఏఓ ఖాలిక్ అహ్మద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంది అసత్య ఆరోపణలు ఖండిస్తున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి భూములు ఇచ్చే రైతులకు అందిస్తున్న పరిహారం విషయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ ఆదిలాబాద్ రూరల్ మండల అధ్యక్షులు కుంచెట్టి సంతోష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నష్ట పరిహారానికి ధర నిర్ణయించేది ప్రభుత్వం, అధికారులన్న ఆయన ధర విషయంలో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు రైతులకు అధిక ధర ఇప్పించే ప్రయత్నం చేయాలనీ హితవు పలికారు. ఎమ్మెల్యేపై నిరాదర ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు దయాకర్, మహేందర్, కార్తిక్ ఉన్నారు.

పాఠశాలకు ప్లేట్ల విరాళం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు వినోద, ఎజ్జీటీ ఉపాధ్యాయురాలు రాణి బదిలీపై వెళ్లడంతో సోమవారం విద్యార్థులకు రూ.12 వేల విలువగల ప్లేట్ల విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామస్తులు కలిసి శాలువతో సత్కరించి సన్మానించారు. ఉపాధ్యాయురాలు వినోద తాను చదువు చెప్పిన విద్యార్థినులకు రూ.12 వేల విలువ చేసే 150 ప్లేట్లను విరాళంగా అందజేసి తన ఉదారతన చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామేశ్వరరావు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ మహేందర్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణవేణి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళులర్పించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సమగ్ర శిక్షలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగులకు ఆదిలాబాద్ మండల విద్యా శాఖ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చనిపోయిన ఉద్యోగులకు ప్రభుత్వం రూ.పది లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, ఎన్నికల సందర్భంగా వరంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులను రేగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు దర్శన్, అశ్వక్, విజయ్, భాను శంకర్, జావీద్, తేజస్వి, సీసీ ఓ రమేష్, అఫ్రిన్, ఎంఐఎస్ మంజుల, ప్రియాంక పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈనెల 5 నుండి 9 వరకు నిర్వహించిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో అధికారులందరూ సమన్వయంతో పనిచేశారని, ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. నెలలో ప్రతి మొదటి మూడవ శనివారాలు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. శాఖల వారిగా కేటాయించిన ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నషా ముక్త్ భారత్ కార్యక్రమం నాలుగో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మాదకద్రవ్యాల రహిత సమాజానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని, మాదకద్రవ్యాలను అరికట్టేందుకుగాను అధికారులచే కలెక్టర్ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌ఓ భుజంగ్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎయిడ్స్ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎయిడ్స్, కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ ఎం.గజానన్ అన్నారు. సోమవారం పట్టణంలో అంతర్జాతీయ యువజన ఉత్సవాన్ని పురస్కరించికొని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో పాఠశాల, కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, రక్తదానం, సుఖవ్యాధులు, టీబీ వ్యాదులపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధులపై వారం రోజులుగా అవగాహన కల్పించి, వివిధ రకాల పోటీలు 2కె, 5కె పరుగు, క్విజ్, డ్రామా, రీల్ పోటీలు నిర్వహించమన్నారు. పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు మొదటి బహుమతి రూ.1000, రెండవ బహుమతి రూ.750 మూడవ బహుమతి రూ.500తో పాటు సర్టిఫికెట్ లు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం హెచ్ఐవీ నివారణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మలేరియా జిల్లా అధికారి డా. ఎం.శ్రీధర్, ఆరోగ్య బోధకులు పి.వెంకట్ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ప్రోగ్రాం మేనేజర్ బి.నాగరాజు, పర్యవేక్షకుడు వి.అనిల్ కుమార్, సతీష్, రాజశేఖర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బానురేఖ, సరిత, విద్యార్థులున్నారు.

ప్రయివేటు పాఠశాలలో పుస్తకాల పేరుతో దోపిడీ

నవతెలంగాణ-సారంగాపూర్



ప్రయివేట్ పాఠశాలలో పుస్తకాల పేరుతో దోపిడిని అరికట్టాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వివేకానంద ప్రైయివేటు ఉన్నత పాఠశాలో సోమవారం ఏబీవీపీ సభ్యులు పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పుస్తకాలు, యునిఫాంలు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. మధ్య తరగతి తల్లిదండ్రులను ప్రైయివేట్ పాఠశాల ఇంత దోపిడీ చేస్తున్న అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సూచనీయం మన్నారు. ఇప్పటికైనా మండల విద్యాధికారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | 13 ఆగస్టు, 2024 | www.navatelangana.com

బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వివిధ రకాల సమస్యలతో పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం డీపీఓ కార్యాలయంలో వివిధ మండలాల నుండి వచ్చిన ఫిర్యాదుదరల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల పోలీస్ స్టేషన్‌లకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుని వారికి సత్వర న్యాయం చేయాలని సూచించారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకునేలా చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బాధితులకు స్వాంతన కలిగించేలా వ్యవహరించాలన్నారు. ప్రజలతో మమేకమై పోలీసులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బిబ్రా గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం రోగులకు ఉచిత చికిత్స, వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం వల్ల అన్ని రకాల వ్యాధులు నయమవుతాయన్నారు. ఆయుర్వేదంలో చికిత్స లేని రోగమే లేదని అందుకే ప్రజలందరూ ఆయుర్వేదాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది రజిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ పకడ్బందీగా అమలు చేద్దాం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమ సాధనపై సమిష్టిగా కృషి చేద్దామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆర్డీఓ లోకేశ్వర్ రావు, డీడబ్ల్యూఓ భాస్కర్‌తో కలిసి జిల్లా అధికారులతో నషా ముక్త్ భారత్ అభియాన్ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో స్వచ్ఛందంగా పాల్గొని క్రియాశీల భాగస్వాములమవుదామని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, నష్టాలపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కలిగించి ఏ ఒక్కరు మాదకద్రవ్యాల బారిన పడకుండా సమిష్టిగా కృషి చేద్దామన్నారు. మాదకద్రవ్యాల విక్రయం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని సమీప పోలీస్ స్టేషన్‌లో అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నూతన జీఎంకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీనివాస్‌ని పలువురు సన్మానించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్య మొగిలి ఆధ్వర్యంలో జీఎంతో పాటు ఎస్ఓ టూ జీఎం రాజమల్లు, ఏజీఎం భీమ్‌రావు జాడేని సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు బీ జగ్గయ్య, శేషు, ఆనంద్, కిరణ్ బాబు, మీసా చంద్రశేఖర్, ఖైరగూడ ఫిట్ సెక్రటరీ మారం శ్రీనివాస్, సీహెచ్‌పీ ఫిట్ సెక్రటరీ రామయ్య, వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ అశోక్, సివిల్ ఫిట్ సెక్రటరీ గడ్డం రమేష్, బెల్లంపల్లి ఏరియా హాస్పిటల్ సహాయ కార్యదర్శి పుట్ట శీను, ఫిట్ సేఫ్టీ కమిటీ మైన్స్ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులను కలిసిన జీఎం

జీఎంగా బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీనివాస్ సోమవారం జిల్లా అధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. అదనపు పాలనాధికారి తివారీ, ఆర్డీఓ లోకేష్‌లను కలెక్టరేట్ కార్యాలయాని చేరుకొని మొక్కను బహూకరించి పరిచాయం చేసుకున్నారు. ఏరియా ఉత్పత్తి , ఉత్పాదకత, నూతనంగా ప్రారంభించబోయే గనుల గురించి వివరించారు. ఆయన వెంట కాలరీ మేనేజర్ మహేష్ ఉన్నారు.

జీఎంను సన్మానించిన టీబీజీకేఎస్ నాయకులు

బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా జనరల్ మేజర్, ఎస్ఓ టూ జీఎంలుగా బాధ్యతలు స్వీకరించిన ఎం శ్రీనివాస్, రాజమల్లుని బొగ్గు గని కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియా తరఫున స్వాగతం పలికి సన్మానించారు. బెల్లంపల్లి ఏరియాను సింగరేణిలో అన్ని ఏరియాలకు ధీటుగా ఉత్పత్తి సంక్షేమం అభివృద్ధిలో ముందు ఉంచాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రజ్ శ్రీనివాసరావు, కార్యదర్శి అలవేణి సంపత్, సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ తరావత్ మంగీలాల్, జాయింట్ సెక్రెటరీ గజ్జెల్లి చంద్రశేఖర్, ఓరం కిరణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మాంతూ సమ్మయ్య, జీఎం ఆఫీస్ ఫిట్ కార్యదర్శి గడ్డం రవీందర్, ఏరియా కమిటీ నాయకులు దేవేందర్, సంపతి తిరుపతి, కొండు శంకర్, మంకయ్య, దుర్గం వెంకటేశ్వర్లు, కలీముల్ల ఖాన్ పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయాల్లో విద్యార్థినిలకు కాగాజ్‌నగర్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి రమాదేవి మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టిజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైన వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మహిళలకు రక్షణ కల్పించడం కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. షీ టీం కాగాజ్‌నగర్ ఫోన్ నంబర్ 8712670565కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం, షీ టీం సభ్యులు శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

వీవీల నియామక విధానాలు ప్రకటించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేల కృషి మేరకు జిల్లాలో 500 ఉపాధ్యాయ ఖాళీల్లో వీవీల భర్తీకి ప్రభుత్వం మౌకిక ఆదేశాలు జారీ చేసిందని, జిల్లా విద్యాశాఖాధికారి వీవీల నియామక విధివిధానాలను ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఆడె ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రేషనలైజేషన్ నిబంధనలను పాటించకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు చేశారని, వీవీల నియామకం నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని కోరారు.

జీపీ ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



జీపీ ఎన్నికలపై అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పంచాయితీ ఎన్నికల దృష్ట్యా జిల్లా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతితో కలిసి ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికలలో ఉపయోగించిన ఓటరు జాబితాను అనుసరించి గ్రామపంచాయతీ ఎన్నికల ఓటర్ జాబితాను తయారు చేయాలన్నారు. ఒకే కుటుంబంలో గల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా జాబితాను తయారు చేయాలని, మహిళలు, పురుషులు, ఇతర ఓటర్లను గుర్తించి ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఓటరు జాబితాను వార్డులు, పంచాయతీలలో ప్రచురించాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా స్పష్టమైన జాబితా రూపొందించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. అర్జీదారులకు నమ్మకం కలిగించేల పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జలపాతం అభివృద్ధికి రుసుం పెంపు

- ధర పెంచడంతో గ్రామస్తుల నుంచి వ్యతిరేకత
- నిరాకరించిన ఏకో టూరిజం కమిటీ



చింతలమాదర జలపాతం

నవతెలంగాణ-తిర్యాణి

మండలంలో గల ప్రఖ్యాత జలపాతంగా పేరుగాంచిన చింతలమాదర జలపాతం వద్ద సందర్శకుల నుండి టికెట్ ద్వారా వసూలు చేసే రుసుమును పెంచి జలపాత అభివృద్ధికి నిధులను సమకూర్చుకోవాలని డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ తెలిపారు. అందుకు అనుగుణంగా ఒక రేట్ల పట్టికను కూడా గిన్నెధరి రేంజ్ అధికారి వెంకటేశ్‌కు అందజేశారు. అయితే ప్రస్తుతం ఉన్న రేట్లతో పోల్చుకుంటే డీఎఫ్ఓ సూచించిన రేట్లు ఎక్కువగా ఉన్నాయని, దీనివల్ల సందర్శకులపై భారం పడి సందర్శకులు ఎవరు కూడా చింతలమాదర జలపాతం వైపు రారని ఈకో టూరిజం కమిటీ చైర్మన్ గోపాల్‌తో పాటు గ్రామస్తులు, కమిటీ సభ్యులు నిరాకరించారు. రెండు రోజులుగా ప్రతిస్తంభన ఏర్పడింది. ఫారెస్టు అధికారులు సందర్శకులను ఎవరిని కూడా జలపాతాన్ని చూడడానికి అనుమతించక పోవడం, అందులో ఆదివారం రావడంతో సుదూర ప్రాంతాల నుండి సందర్శకులు చింతలమాదర గ్రామానికి వచ్చి ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు, ఈకో టూరిజం కమిటీ వాళ్ల ఏకాభిప్రాయానికి వచ్చి సందర్శకులకు అనుమతి ఇవ్వాలని సందర్శకులతో పాటు చింతలమాదర గ్రామస్తులు కోరుతున్నారు. చిన్న పిల్లలకు రూ.10, ప్రస్తుత ధర రూ.30, పెద్దవాళ్లకు రూ.30, ప్రస్తుత ధర రూ.50, టూ వీలర్ రూ.20, ప్రస్తుత ధర రూ.50, ఆటోకు రూ.50, ప్రస్తుత ధర రూ.80, వ్యాను, జీపు, కారు రూ.100, ప్రస్తుత ధర రూ.150, పెద్ద వాహనాలకు రూ.500, ప్రస్తుత ధర రూ.1000, ఫోటోగ్రఫీ రూ.200, ప్రస్తుత ధర రూ.500, వీడియో ఫోటోగ్రఫీ రూ.500, ప్రస్తుత ధర రూ.1000 కాగా విషయంపై గిన్నెధరి రేంజ్ అటవీ శాఖ అధికారి వెంకటేష్‌ను వివరణ కోరగా డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ ఆదేశాల మేరకు సందర్శకులకు టికెట్ ద్వారా కొత్త రేట్లు కేటాయించడం జరిగిందని, ఈ విషయం ఈకో టూరిజం కమిటీ, మరి గ్రామస్తులకు తెలియజేయగా వారు నిరాకరించారని, త్వరలోనే దీనిపై ఏకాభిప్రాయానికి వచ్చి గ్రామ పంచాయతీ తీర్మానంతో కొత్త రేట్లు ప్రకటిస్తామని తెలిపారు.

మరణించిన ఎస్ఎస్ఏ ఉద్యోగులకు నివాళ్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ : నివాళులర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తూ గడచిన నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మరణించిన ఖమ్మం జిల్లా దాసు, రంగారెడ్డి జిల్లా టీవీవీఎస్ ప్రసాద్, నారాయణపేట జిల్లా వెంకట్ రాములు, ఆదిలాబాద్ జిల్లాలో మమతకు జిల్లా కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద భోజన విరామ సమయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేక పనితీవ్రత పెరగడంతో ఒత్తిడికి తట్టుకోలేక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడితే తమ సర్వీస్ రెగ్యులరైజ్ చేస్తుందని ఆశపడ్డప్పటికీ అదేది నెరవేరలేదని, కనీసం ఎంటీఎస్ కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సర్వీస్ రెగ్యులర్ చేయడంతో పాటు, ఆరోగ్య భీమా రూ.ఐదు లక్షలు, జీవిత బీమా రూ.10 లక్షలు అమలు చేసి, ఉద్యోగ విరమణ 61 సంవత్సరాలకు పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి బోయిని నగేష్, ఎంఐఎస్ జిల్లా అధ్యక్షుడు గేడేకార్ సంతోష్, మండల అధ్యక్షుడు వెంకటరమణ, సభ్యులు అనూప్, చిట్ల తిరుపతి, రాము, గాంధే రమేష్, చంద్రి సుభాష్, స్వప్న, ప్రవళిక, సంతోష్, కవిత పాల్గొన్నారు.

బెజ్జూర్ : సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్షణా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీజీ గురుకుల విద్యాలయంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీలో పని చేస్తూ మరణించిన మహిళా ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఎస్ఓ అరుణ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేని కారణంగా తక్కువ వేతనాలతో పనిచేయడం వల్ల మానసిక ఒత్తిడిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు సరిపోకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. నిరాశతో గుండె పోటు ఇతరత్రా కారణాలతో మరణిస్తున్నారని తెలిపారు. మరణించిన ఉద్యోగులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, మినిమం పే స్కేల్‌ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ సీఆర్టీలు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగులకు సోమవారం సమగ్ర శిక్షణ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించలేదని, తక్కువ వేతనాలతో పాటు పనితీవ్రత పెరిగిందన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో దశలవారీగా నిరసనలు తెలియజేసి సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చంద్రశేఖర్, రవీందర్, సంతోష్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.



దహెగాం

మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



జాతీయ జెండాలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సూచనల మేరకు హర్‌గర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం మండలాధ్యక్షుడు పాలె సంతోష్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ దేశాన్ని ఏకం చేయడానికి సర్దార్ వల్లాభాయ్ పటేల్ చేసిన కృషిని దేశం ఎప్పుడు గుర్తించుకుంటుందని, నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ ప తాకాన్ని ఎగరవేయాలన్నారు. ర్యాలీలో బీజేవైఎం నాయకులు పాగిడె కాంతారావు, పల్లెం పురుషోత్తం, హరీష్, శ్రీనివాస్, సాయికిరణ్, ప్రభాకర్, మహేష్, నరేష్, పోశన్న పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మిషన్ భగీరథలు పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో భగీరథ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ప్రతిరోజు నల్ల నీరు అందించే కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దీంతో వారి ఆర్థిక పరిస్థితి క్షీణించి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ప్రకారం ఈ నెల 12 సోమవారం నుండి సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు రూ.26,000 అమలు చేయడంతో పాటు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ యూనియన్ జిల్లా నాయకులు దుర్గం లింగయ్య, రమేష్, బాలేష్, బుద్దయ్య, శంకర్, శేఖర్, అంజి, దేవేందర్ పాల్గొన్నారు.

రెబ్బెనలో మహేంద్ర వర్ధంతి

నవతెలంగాణ-రెబ్బెన

ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఆధ్వర్యంలో కేఎల్ మహేంద్ర 17వ వర్ధంతిని నిర్వహించారు. గోలేటి బ్రాంచ్ సెక్రటరీ ఎస్.తిరుపతి సంఘ ప్రతినిధులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలామాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మిక సంఘానికి అధ్యక్షునిగా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా కొనసాగారని, సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించి కార్మికులు ఇప్పుడు అనుభవిస్తున్న లాభాల్లో వాటాను ప్రభుత్వం నుండి ఇప్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బీ జగ్గయ్య, ఎస్ ఆనంద్, శేషు, కే.కిరణ్, చంద్రశేఖర్, అసిస్టెంట్ ఫిట్ సీహెచ్ పీట్ సెక్రటరీ రామయ్య, వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ అశోక్, సివిల్ ఫిట్ సెక్రెటరీ గడ్డం రమేష్, ఖైరగూడ, సీహెచ్‌పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంకు సన్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మండలం ఐకేపీ ఏపీఎంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కుద్ర రమేష్‌నీ సోమవారం గుండి మాజీ సర్పంచ్ షెండే దత్తు, మాజీ వైస్ ఎంపీపీ సుంకరి పెంటయ్య శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్తయ్య, గణపతి పాల్గొన్నారు.

పోస్టాఫీసు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

పోస్టాఫీసు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ డివిజన్ అధికారి దీకొండ రమేష్ సూచించారు. పోస్టాఫీసు ద్వారా చేపడుతున్న పథకాల గురించి సోమవారం చొప్పన్‌గూడ గ్రామ పంచాయతీలో అవగాహన కల్పించారు. ప్రస్తుత ఆధునిక ఇంటర్‌నెట్ కాలంలో ఉన్నామని, ఒకప్పుడు మనందరికి కనెక్టు చేసేది పోస్టాఫీసుని, అప్పటి నుండి ఇప్పటివరకు మనం చాల మార్పులు చూస్తున్నామన్నారు. కాలనుగుణంగా పోస్టాఫీసు సైతం దీనికి అనుగుణంగా మార్పు కొరియర్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, డిజిటల్ పేమెంట్ మార్చుకుంటూ వచ్చిందన్నారు. ఇటువంటి పోస్టాఫీసు దేశ ప్రజలకు ముఖ్యమైన ఆర్థిక సేవలతో పాటు మరింత చేరువైందన్నారు. పోస్టాఫీసు ద్వారా పలు రకాల చిన్న మొత్తాల పొదుపు పథకాలున్నాయన్నారు. తపాలా కార్యాలయంలో ఎక్కడైన ఈ పథకంలో చేరవచ్చని ఆయన కోరారు. ప్రతి ఒక్కరు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ సాగర్, మండల పోస్టుమాస్టర్ అవినాష్, గ్రామ పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యానికి హాట్సాఫ్

నవతెలంగాణ-రెబ్బెన

మండల పోలీస్ స్టేషన్‌లో మహిళా బాధితురాలు ఆరోగ్యపరమైన సమస్యతో అపస్మార్క స్థితిలో పడిపోవడంతో అక్కడే ఉన్న మహిళా పోలీస్ సిబ్బంది సాయం చేశారు. బాధితురాలు ఫిట్స్ కారణంగా కింద పడిపోవటంతో తలకు గాయమై రక్తస్రావం జరిగింది. దీని గమనించిన ఎస్సై చంద్రశేఖర్ మహిళ పోలీస్ సిబ్బంది హుటాహుటిన పరుగు పరుగున స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో బాధితురాలికి ప్రథమ చికిత్స అందింది. దీంతో రెబ్బెన పోలీస్ అధికారితో పాటు సిబ్బందికి స్థానిక ప్రజలు అభినందించారు.

సెప్టెంబర్ 9న జాతీయ అదాలత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సెప్టెంబర్ 9న జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని జిల్లా జడ్జీ ఎంవీ.రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో ఉన్న బ్యాంకింగ్, ప్రీ లిటిగేషన్, సివిల్, క్రిమినల్, ఎలక్ట్రిసిటీ, భూవివాదాలు, వివాహ కేసులు, వాహనాల కేసులు, చిట్ ఫండ్స్ కేసులు పరిష్కారం కోసం లోక్ అదాలత్ వినియోగించుకోవాలని, దీనికోసం ఈనెల 24న పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బెజ్జూరులో ఎక్కహం

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో దేవాంగ సంఘం మండల అధ్యక్షులు పొలాస శేఖర్ ఆధ్వర్యంలో శ్రావణ సోమవారం సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎక్కహం కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంఘం గౌరవ అధ్యక్షులు బెనికి శ్యాంసుందర్, సభ్యులు నాగుల రాజమౌళి, రవి, గోరంటల బాపు, చంద్రమౌళి, బెగుడ చంద్రమౌళి, మాడ సత్తయ్య పోలాస కేదారి, మండిగ కొండయ్య, భక్తులు శ్రీరామ, మిరియాల శివయ్య సత్తయ్య, అన్నారం మల్లయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తిర్యాణి

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విలేజ్ బస్సు ఆఫీసర్ చక్రం లక్ష్మణ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకాన్ని ప్రతి ఒక మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని శుభకార్యాలకు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందుబాటులో ఉండే ధరకే కిరాయికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నేరాల నియంత్రణకు పోలీస్ నైట్ హాల్ట్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజలకు మీ రక్షణ, భద్రత గురించి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో మీ సమస్యలు పరిష్కరిస్తూ పోలీసులు నమ్మకం, భరోసా కల్పిస్తూ నేరాల నియంత్రణకు పోలీస్ నైట్‌హాల్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. దానిలో భాగంగా శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి కృష్ణ కాలనీలో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలడు అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో ప్రజలు ప్రశాంతంగా మెలగాలన్నారు. ఘర్షణలకు పాల్పడకుండా స్నేహ భావంతో ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. యువతను ఉద్దేశిస్తూ గంజాయి, ఇతర అసాంఘిక కార్యక్రమాల జోలికి పోయి యువత తమ బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని అన్నారు. గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడానికి గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా యవత అసాంఘిక కార్యకలాపాలపైపు పెడదారి పట్టి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు.

ఉద్యోగాల పేరుతో వసూళ్లుకు పాల్పడిన వ్యక్తి ఆత్మహత్యా యత్నం

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల మున్సిపాలిటీలో ఉద్యోగాల పేరుతో వసూళ్ల దందాకు పాల్పడిన కార్మికుడు నవీన్ ఆత్మహత్యా యత్నం వీడియో సోమవారం పట్టణంలో చర్చనీయ అంశం అయింది. నెయిల్ పాలిష్ తాగి తనచావుకు కారణం మున్సిపల్ కార్మిక సంఘం నాయకుడు హరికృష్ణ కారణమంటూ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రస్తుతం నవీన్‌ను కటుంబసభ్యులు మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు. మున్సిపల్‌లో పర్మినెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని 8 మంది వద్ద రూ.4 లక్షలు వసూలు చేసి హరికృష్ణకు రూ.2 లక్షలు ఇచ్చినట్లు నవీన్ పేర్కొంటున్నాడు. ఐదేండ్లు గడుస్తున్నా వారికి ఉద్యోగం ఇవ్వకపోవడంతో వారు ఒత్తిడి చేయడంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్టు పేర్కొంటున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టిన తెలిసింది.

అంబులెన్స్‌లో గర్భిణీ ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



నవతెలంగాణ-మంచిర్యాల

పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్‌లో సిబ్బంది సమయస్ఫూర్తితో కాన్పు నిర్వహించారు. మహిళా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. దహెగాం మండలం కర్జీ గ్రామానికి చెందిన రమాదేవికి పురిటి నొప్పులు రావడంతో బెల్లంపల్లి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్య నిమిత్తం మంచిర్యాల మాతా శిశు ఆసుపత్రికి తరలించాలని సూచించారు. మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మహిళా పురిటి నొప్పులు తీవ్రమై పరిస్థితి విషమించే అవకాశాలు కనిపించడంతో అంబులేన్స్ మధ్యలో పక్కకి అపి ఈఎంటీ శహబాజ్ సమయస్ఫూర్తితో డాక్టర్ల సూచనలతో సాధారణ కాన్పు గావించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మంచిరాల మాతా శిశు ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఈఎంటీ శహబాజ్, పైలెట్ రంజిత్‌ను జిల్లా కార్యనిర్వహన అధికారి సంపత్, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్రామాట్ అభినందించారు.

కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కోతుల, కుక్కల బెడద ఎక్కువైందని, వాటి నుంచి ప్రజలను కాపాడాలని తిమ్మాపూర్ గ్రామస్థులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో అధికారులకు వినతి పత్రం అందించారు. గుగ్గులావత్ రవి, కూకటికారి శంకర్, దేవా రాజశేఖర్, పసుల శంకర్ మాట్లాడుతూ కోతుల, కుక్కలు ఎక్కువ అవడంతో వృద్ధులను చిన్నారులపై తరచూ దాడి చేస్తున్నాయన్నారు. వాటి నుంచి గ్రామ ప్రజలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, గంగానాయక్, మల్లే శ్రీనివాస్, వెంకటేష్, నరేష్ పాల్గొన్నారు.

మేకల మార్కెట్ బహిరంగ వేలం

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని తీగలపహాడ్ యాదవనగర్‌లో గల మేకల మార్కెట్ రుసుము వసూలునకు (2024-25 ఆర్థిక సంవత్సరమునకు) ఆగస్టు 16వ తేదీ వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 19న జరగవలసిన వేలం కొన్ని కారణాలవల్ల వాయిదా పడిందని, ఈ వేలము ఆగస్టు 16న మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు కమిషనర్ నస్పూర్ మున్సిపాలిటీ పేరుతో డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకొని కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

స్వచ్ఛదనం-పచ్చదనంపై కళాజాత

నవతెలంగాణ-దండేపల్లి

జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం దండేపల్లి మండల కేంద్రంలో పచ్చదనం పరిశుభ్రతపై తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చదనం పరిశుభ్రతపై ముఖ్యంగా డెంగ్యూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆట, పాటల రూపంలో తెలియజేశారు. పరిశు భ్రతతో మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృంద నాయకుడు లావుడియా రమేష్ సభ్యులు ముల్కల మురళి, పోశం, శ్రీనివాస్, కిష్టయ్య, కృష్ణ, రవీందర్, సత్యనారాయణ, నాగలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

ప్రయివేటు అంబులెన్సు డ్రైవర్ల హల్చల్

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి ప్రయివేటు అంబులెన్సు డ్రైవర్‌లు మద్యం తాగి హంగామా చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు అంబులెన్స్ వాహనంలో మద్యం తాగుతూ అడ్డంగా దొరికి పోయారు. అంబులెన్స్ వాహనాన్ని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న మేకల సాయిరామ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయనతోపటు ఉన్న ఇద్దరు పారిపోయారని వారిని సైతం అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. అంబులెన్స్ డ్రైవర్‌ల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తపాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



గ్రామీణులు పోస్ట్ ఆఫీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సుపరింటెండెంట్ పోస్ట్ ఆఫీస్ ఆఫీసర్ రాథోడ్ రామారావు అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పోస్ట్ ఆఫీస్‌లో దొనబండ సబ్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లోని ఆర్డీ, ఎస్‌పీ, సుకన్య, సీనియర్ సిటిజన్, పీపీఎఫ్, మహిళా సమ్మాన్ సేవింగ్ అకౌంట్, రూరల్ పోస్టల్ ఇన్సూరెన్స్ గురించి వివరించారు. దీంతో గ్రామస్తులు ఒకే రోజు 218 సేవింగ్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఈ కార్యక్రమంలో దొనబండ ఎస్‌పీఎం సుప్రియ, పంచాయతీ కార్యదర్శి సునీత, బీపీఎంలో తిరుపతిరెడ్డి, శంకరయ్య, శ్రీనివాస్, అశోక్, సంధ్య పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఈ నెల 15వ తేదీన అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి రాములు, హరికృష్ణలతో కలిసి జిల్లా అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జిల్లాలోని నస్పూర్ గల సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో నిర్వహించనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. డీసీపీ, రాజస్వ మండల అధికారి, జిల్లా గ్రామీణాభివద్ధి అధికారి, మంచిర్యాల-నస్పూర్ మున్సిపల్ కమీషనర్లు, తహశిల్దార్ల సమన్వయంతో పరేడ్ గ్రౌండ్ ఏర్పాట్లు, ఆర్‌డీఓ, డీఆర్‌డీఓ, మంచిర్యాల-నస్పూర్ మున్సిపల్ కమీషనర్లు, నస్పూర్ తహసీల్దార్ల సమన్వయంతో ప్రొటోకాల్ ప్రకారం సీట్లు, వేదిక, కుర్చీలు, టెంట్లు, షామియానాలు, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లు, నస్పూర్ మున్సిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో తాగునీరు, గ్రౌండ్ వాటరింగ్, బెల్లంపల్లి ఏసీపీ, జిల్లా విద్యాధికారి, ఇంటర్మీడియట్ అధికారి సమన్వయంతో జాతీయ గీతాలాపన, పోలీస్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్ధహించాలని వివిధ శాఖల అధికారులు బాధ్యతులు తీసుకోవాలని సూచించారు.

భూదాన్ భూమిలో గ్రౌండ్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఉన్న భూదాన్ భూమిలో గ్రౌండ్ ఏర్పాటు చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం ప్రజావానిలో కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు భూములను, గతంలో భూస్వాములు, భూదాన్ యజ్ఞ బోర్డు వారికి దాదాపు 40 ఎకరాల భూమి ఇచ్చారని, ఈ భూమిలో మాత శిశు ఆస్పత్రి నిర్మించడం జరిగిందని, మిగిలి ఉన్న భూమి కొన్ని సంవత్సరాల నుంచి ఖాళీగా ఉంటుందన్నారు. భూదాన్ భూమికి సంబంధించి ఏకలవ్య ఆశ్రమం వెనకాల ఉన్న భూదాన్ భూమిలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాత్కాలిక రోడ్డు వేసి ఆ రోడ్డు తమ రోడ్డుగా చూపిస్తూ వారికి సంబంధించినటువంటి కట్టడాలను అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇదే అంశంపై పలుమార్లు గతంలో ఉన్న కలెక్టర్‌కు ఫిర్యాధు చెస్తే వారు స్పందించి కబ్జాకు గురైన రోడ్డుని గుర్తించి అందులో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్ఐ సమక్షంలో ట్రెంచ్ కొట్టించారన్నారు. ట్రెంచ్ కొట్టినా పదిరోజులకే ట్రెంచ్ కొట్టిన స్థలాన్ని చదును చేసి మళ్లీ ఆ రోడ్డుని ఏదాస్థితిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉపయోగిస్తున్నారు. ఇదే అంశంపై మరల అప్పటి కలెక్టరు కు వినతిపత్రం ఇచ్చిన ఎలక్షన్ సమయం అని పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల్ జిల్లా కన్వీనర్ నల్ల నాగేంద్రప్రసాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ నయీం పాషా, సీనియర్ నాయకులు చింతకింది తిరుపతి, యువజన సంఘం అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొంటు రాజు పాల్గొన్నారు.

విలేకరుల పేర్లతో డబ్బులు వసులు చేస్తే కఠిన చర్యలు

● మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్

నవతెలంగాణ-మంచిర్యాల



జన్నారంలో..

మంచిర్యాల జిల్లాలో నకిలీ విలేఖరులుగా చలామణి అవుతూ అక్రమ వసూల్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ అన్నారు. సోమవారం మంచిర్యాలలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలేకరుల పేర్లతో అక్రమాలకు పాల్పడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నామని, ఎలాంటి గుర్తింపు లేని కొందరు వ్యక్తులు విలేఖర్లుగా చెప్పుకుంటూ వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లు వేసుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారని, గౌరవ ప్రదమైన వృత్తుని అడ్డు పెట్టుకొని ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, గతంలో మంచిర్యాల, లక్షెట్టిపేట్, జన్నారం లో నకిలీ విలేకరులపై పలు కేసులు నమోదు అయ్యాయని, ఇలాంటి వారికోసం జిల్లాలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

జన్నారం : నకిలీ విలేకరులుగా చలామణి అవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఐ రాజవర్ధన్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య మాట్లాడుతూ విలేకరులమంటూ కొంతమంది మండలంలో అధికారులకు, రాజకీయ నాయకులకు, వ్యాపారస్తులకు, పాఠశాల యజమానులకు ఫోన్లు చేసి ప్రముఖ దినపత్రికల పేర్లతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున విలేకరులమని చెప్పుకొని మరి కొంతమంది అక్రమ వసూలు చేస్తున్నారు. ఇలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడే నకిలీ విలేకర్ల వల్ల నిజమైన పత్రికలలో పనిచేస్తున్న విలేకరులపై ప్రజల్లో చులకన భావం కలిగి విలేకరుల ప్రతిష్టకు భంగం కలుగుతుందని అన్నారు. ఈ నెల 11న ఆదివారం మండల కేంద్రంలోని జయరాణి ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ మధుసూదన్‌కు ఫోన్ చేసి నేను మంచిర్యాల జిల్లా ప్రజాతంత్ర స్టాఫ్ రిపోర్టర్ అని, తిరుపతి అనే వ్యక్తి పత్రిక వార్షికోత్సవం ఉందని రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడు ఎంబడి మల్లేశం, కోశాధికారి శీల చంద్రశేఖర్, గుండ పవన్, గోనె సత్యం, ఐలవేని నర్సయ్య పాల్గొన్నారు

బదిలీపై వచ్చిన అధికారికి సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-5,6 గ్రూప్ నూతన ఏజెంట్‌గా బదిలీ పై వచ్చిన శ్రీధర్‌ను ఏజెంట్ కార్యాలయంలో ఆర్కే-5 పిట్ కార్యదర్శి గోనె రామకృష్ణ అధ్యక్షతన బీఎంఎస్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎంకెఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, సెంట్రల్ సెక్రెటరీ రాగం రాజేందర్, ఏరియా కోశాధికారి గూడ శ్రీకాంత్, మంచాల రమేష్, కుమ్మరి చంద్రశేఖర్, కొల్లూరి కృష్ణ, గసిగంటి రమేష్, సచిన్ పాల్గొన్నారు.

లక్షెట్టిపెట వాసికి జపాన్‌లో అవార్డు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేటకు చెందిన ఉత్తూరి వినయ్ ప్రముఖ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ లో ప్రతిష్టత్మకమయినా సీఈఓ క్లబ్ కన్వర్షన్ 2024-25 అవార్డు ప్రపంచ వేదికపైన జపాన్‌లో ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ ముందుగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి, సేల్స్ మేనేజర్ సురేందర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డు తీసుకోవడం గర్వంగా ఉదన్నారు.

సోదర ప్రేమకు ప్రతిరూపమే రక్షాబంధన్

నవతెలంగాణ-జన్నారం

సోదర ప్రేమకు ప్రతిరూపమే రక్షాబంధన్ అని బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, బ్రహ్మకుమారి ట్రస్ట్ సీనియర్ టీచర్ మంజూ దీదీ అన్నారు. రక్షాబంధన్ పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ముందస్తు రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మ కుమారిస్ ట్రస్టు సభ్యులు పలువురికి రాఖీలు కట్టారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు రక్షాబంధన్ నిర్వహిస్తామని మంజూ దీదీ తెలిపారు.

ఓటరు జాబితాపై సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీఓ షేక్ ఫర్ అలీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితాలు తయారు చేయండపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా మెర్జింగ్ స్టేట్ మెంట్ ఏ విధంగా తయారు చేయాలనే దానిపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సహాయకులు ఏ. లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ నిర్వహించే పౌర సన్మాన కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా బి జనక్ ప్రసాద్ నియామకమైన సందర్భంలో, జన్మదిన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం మందమర్రి ఏరియాకు వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న విశిష్ట పౌరసన్మాన కార్యక్రమానికి ఐఎన్టీయూసీ కార్యకర్తలు, కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ పిట్ సెక్రెటరీ కారుకురి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చింతం రవి కిరణ్, ఏరియా నాయకులు సెగ్గం శ్రీనివాస్, కొప్పుల బాపు, చింతం సత్తయ్య, గాలి పరమేష్, యువ నాయకులు పిరిసింగుల రాజు, గెల్లి మనోహర్, గొల్ల రాజేందర్, అయిల రవి, అవునూరి రవి, బామండ్లపల్లి తిరుపతి, ఖాషీం, ఉయ్యాల కేదరి పాల్గొన్నారు

కాసిపేట గనిపై ఆందోళన



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై ఇటీవల గనిలో ట్రామర్ విధులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురై తీవ్రగాయాలైన శరత్ కుమార్ కుటుంబ సభ్యులు, కార్మికులు ఆందోళనకు దిగారు. శరత్ కుమార్‌కు న్యాయం చేయాలని, గని ప్రమాదాలు అధికంగా అవుతున్నాయని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గని మేనేజర్‌తో ఈ విషయంపై చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యాక్షుడు దేవి భూమయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ భాగం మల్లేష్, పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యా వాలంటీర్లను నియమించాలి



నవతెలంగాణ-నస్పూర్

బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేసి వారి స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆసంపెల్లి రమేష్ అన్నారు. సోమవారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో నస్పూర్ మండలంలో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఇప్పటికే సంవత్సరం దాటిపోయినందున పీఆర్సీ అమలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్, కార్యదర్శి విజయ్, ఆంజనేయులు, సరిత పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తంగళ్లపల్లి గ్రామ సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని కోనూర్ గ్రామ పంచాయతీలో తంగళ్లపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, బాలరాజ్, మండల ఉపాధ్యక్షులు పెద్దపెల్లి శంకర్, భాకి కిరణ్, బీజేవైఎం నాయకులు విష్ణువర్ధన్, మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు మల్లేష్, గ్రామస్తులు, గ్రామ యువకులు ఆక్కల రమేష్, పనాస, సురేందర్, నల్ల శ్రీనివాస్, చింతం శేఖర్, గోపతి చందు, అక్కల సత్తయ్య పాల్గొన్నారు.

రేపటి బంద్‌కు సహకరించాలి

నవతెలంగాణ-జన్నారం

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జన్నారం పట్టణ, మండల బంద్‌కు పిలుపునిస్తున్నామని హిందూ సంఘాల నాయకులు ప్రకటించారు. సోమవారం జన్నారంలో మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు జన్నారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అలాగే బుధవారం పట్టణ, మండల బందుకు పిలుపునిస్తున్నామని వెల్లడించారు. ఈ బందుకు అందరూ సహకరించాలని కోరారు. హిందూ సంఘాల నాయకులు నగేష్, గంగాధర్, రాకేష్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి వివేకానంద చౌక్‌లో వివేకానందుని చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. వివేకానందుడు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకులు బాలశంకర్ కృష్ణ మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తితో యువత సన్మార్గంలో పయనించాలన్నారు. చేడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో యువజన, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అబ్దుల్ అజీజ్, శశికళ, దేవిదాస్, మిట్టు రవి పాల్గొన్నారు.

పేద ప్రజల అభివృద్ధియే లక్ష్యం

నవతెలంగాణ-ఇచ్చోడ



బోథ్ నియోజకవర్గంలో పేద ప్రజల అభివృద్ధియే లక్ష్యంగా అనునిత్యం ప్రజలకు సేవకు విజయ శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్‌ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ సభ్యులు కొండ రాజన్న అన్నారు. సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ట్రస్ట్ చైర్మన్ సభావాత్ శ్రీనివాస్ నాయక్ జన్మదిన సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండా రాజన్న మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించడంతో పాటు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాపురావు, శేఖర్ రెడ్డి, అడెల్లు, రాజు పాల్గొన్నారు.

నా భర్తను కాపాడండి

- ఇమ్మిగ్రేషన్ అధికారులకు వినతి



నవతెలంగాణ-ముధోల్

కువైట్ దేశంలో చిక్కుకున్న మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్‌ను స్వదేశానికి తిరిగి తెచ్చే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని పాస్ పోర్ట్, ఇమ్మిగ్రేషన్ అధికారి అమిత్ కుమార్‌ను బాధిత కుటుంబ సభ్యులు కలిశారు. హైదరాబాద్‌లో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీఎస్ఎండీసీ చైర్మన్ ఇరవత్రి అనిల్ ఆధ్వర్యంలో సోమవారం బాధితుడు కుటుంబ సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. క్లీనింగ్ అని చెప్పి ఏజెంట్ మాయమాటలు చెప్పి కువైట్ దేశానికి పంపించడంతో అక్కడ ఎడారిలో ఒంటెలు మేపుతు తన భర్త ఇబ్బందుల పాలవుతున్నాడని నాందేవ్ భార్య రాథోడ్ లక్ష్మి వాపోయారు. తక్షణం స్పందించి నాందేవ్‌ను స్వదేశానికి తేవాలని వారుకోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీం రెడ్డి, తెలంగాణ జనసమితి ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్, నాందేవ్ కుమారుడు శ్రీకాంత్, నాయకులు నరహరి గౌడ్, నరేందర్, రంజిత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అనవసరమైన లింకులు ఓపెన్ చేయొద్దు

నవతెలంగాణ-జైనథ్

సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త విధంగా ప్రజలను మోసం చేస్తున్నారని, వాట్సాప్‌లో వచ్చే అనవసరమైన లింకులు ఓపెన్ చేయొద్దని సీఐ సాయినాథ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రివార్డ్స్, క్యాష్ బ్యాక్ వచ్చాయంటూ లింక్స్ పంపిస్తే వాటిని క్లిక్ చేయొద్దన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని వార్డుల్లో పారిశుద్ధ పనులను ముమ్మరంగా చేపట్టారు. మురుగు కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని తొలగించే పనులను పంచాయతీ కార్మికులు చెప్పట్టారు. ఈ సందర్భంగా ఈఓ ప్రసాద్ గౌడ్ సోమవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలు తమ వంతు బాధ్యతగా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా చెత్త బండిలోనే వేయాలన్నారు. ప్రజల సహకారంతో పారిశుద్ధ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే వార్డుల వారీగా మురుగు కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ పనులు చేపడుతున్నారన్నారు.

వ్యాధులపై ఆశాలకు అవగాహన



నవతెలంగాణ-నార్నూర్

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశాలకు పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆశాలు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్, గ్రామ కార్యదర్శి, వైద్య సిబ్బందితో కలిసి ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటుకు వైద్య సిబ్బందితో వంద శాతం సహకరించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు. అవగాహన సదస్సు కార్యక్రమంలో సిహెచ్ఓ లక్ష్మీ, హెచ్ఈఓ తులసీదాస్, పీహెచ్ఎన్ఓ సుశీల, హెల్త్ సూపర్వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సత్తవ్వ, గణేష్, జీఎస్ఎంలు, ఏఎస్ఎంలు, మండలంలోని అన్ని గ్రామాల ఆశాలు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలిసిన మాదిగ జేఏసీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ కార్పొరేషన్ నూతన ఈడీగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌రావును తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని నిరుపేద ఎస్సీలకు రాబోయే రోజులలో రుణాలు అందించి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. తప్పకుండా తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు నక్క రాందాస్, బాబు జగ్జీవన్‌రామ్, అధ్యక్షులు మల్యాల స్వామి, జిల్లా కమిటీ నాయకులు జువ్వాక నర్సిములు, కత్తి గంగాధర్, అశోక్, జెల్ల మహేందర్, భూమన్న, మహేందర్ పాల్గొన్నారు.

పోలీసులు అందుబాటులో ఉండి పనిచేయాలి

- ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న సీఐ, ఎస్ఐలకు బదిలీ కాగా వారు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసినప్పుడు పోలీసులకు గుర్తింపు వస్తుందని తెలిపారు. కష్టాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారి పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ అయి చార్జి తీసుకున్నవారు

జైనూర్ సీఐగా ఈ.రమేష్, కౌటాల సీఐగా ఎం. రమేష్, చింతలమానపెల్లి ఎస్సైగా నరేష్, జైనూర్ ఎస్సైగా సాగర్, సిర్పూర్(యు) ఎస్సైగా రామకృష్ణారావు, కాగజ్‌నగర్ రూరల్ ఎస్సైగా మహేందర్, వాంకిడి ఎస్ఐగా ప్రశాంత్ చార్జి తీసుకున్న వారిలో ఉన్నారు. పై అధికారులలో కౌటాల సీఐ, వాంకిడి ఎస్ఐ ఇతర జిల్లాల నుండి రాగ మిగతావారు ఇదే జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేసినవారు ఉన్నారు.

ఫోన్ల రికవరీలో పోలీస్ పనితీరుకు ఎస్పీ అభినందనలు

గత సంవత్సరం ఏప్రిల్ నెలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తీసుకువచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరీ చేసిన ఫోన్లలో జిల్లా మంచి పనితీరు కనబరిచిన నేపథ్యంలో జిల్లా పోలీస్ సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పట్టుకునేందుకు పోలీస్ శాఖ తీసుకువచ్చిన సీఈఐఆర్ ద్వారా గడిచిన 15 రోజుల్లో 30 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా తమ మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్ నందు మొబైల్ బ్లాక్ చేసి దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇతరులు దొంగిలించిన ఫోన్లను తక్కువ ధరకు వస్తున్నాయని ఎవరు కొనుగోలు చేయకూడదని, సీఈఐఆర్ ద్వారా మొబైల్ ట్రేస్ అయితే దానిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే 1930కు ఫోన్ చేయాలని తెలిపారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నిర్మల్

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సమితి కన్వీనర్ కైలాస్ మాట్లాడుతూ 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరంలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించి, దేశ స్వతంత్రం పోరాటంలో ప్రధాన పాత్ర పోషించిందన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి, విద్యార్థులందరినీ ఐక్యం చేసి పోరాడిన ఘనమైన చరిత్ర ఉందన్నారు. నాటి నుండి నేటి వరకు దేశం, రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు, ప్రైయివేటు, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, ప్రభుత్వ విద్యా రక్షణకు నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. 89వ ఆవిర్భావ దినోత్సవానికి స్ఫూర్తిగా విద్యా రంగ సమస్యల పరిష్కారానికై నేటి తరం విద్యార్థులు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో నరేష్, ప్రవీణ్, సన్ని, పవన్, దుర్గే. అనంత్‌రావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : రాజీలేని పోరాటాలు చేయడంలో ముందుంటామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ అన్నారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి గెడం కేశవ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం రాకపూర్వమే దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘంగా లక్నో మహానగరంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్, ఆజాద్ ఇంకా ఎందరో వీరుల ఆశయ సాధన కోసం బ్రబ్రుద్దీన్ ప్రేమ్ నారాయణ భార్గవ్ నాయకత్వాన 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల బానిస చేర నుంచి మాతభూమి విముక్తి కై సాగిన వీరోచిత స్వాతంత్ర ఉద్యమంలో పోత్తిళ్లలోనే పిడికిలి బిగించి స్వాతంత్రం మా జన్మ హక్కు అని మా అంతం చూసినా స్వాతంత్రోద్యమ పంతం వీడమంటూ నినదించి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని భరతమాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని ఎందరో విద్యార్థులు విప్లవ కిశోరుల బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన దేశంలోనే ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తాబ్రెజ్ ఖాన్, వైష్ణవి, కల్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.





దేశ ప్రజలకు లబ్ది చేకూర్చే విధంగా కేంద్ర బడ్జెట్

- ఎంపీ గోడం నగేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశ ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా ఉందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. దూర దృష్టితో ప్రధాన మంత్రి నరేంద్ర బడ్జెట్లో రూ. 48 లక్షల కోట్ల బడ్జెట్‌ను పెట్టించి ఆమోదించారన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. యువత కోసం స్కిల్ డెవలప్మెంట్‌కు కోట్ల నిధులు కేటాయించమన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం 51 వేల కోట్లను బడ్జెట్లో పెట్టిందన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు అవగాహన లేకుండా కేంద్రంపై విమర్శలు చేస్తు మాట్లాడడం సరికాదన్నారు. ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కనే స్వయంగా బడ్జెట్ పద్దులు ప్రవేశపెట్టే సమయంలో కేంద్రం నుంచి వస్తున్న నిధులు గురించి ప్రస్తవించారన్నారు. ప్రభుత్వం ఏమో ఇస్తుందని చెబుతుంటే నాయకులు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రెండు నాలుకల దోరణి అవలండిస్తుందని, బడ్జెట్లో ఏపీ, బీహార్ రాష్ట్ర గురించి మాట్లాడడం సరికాదన్నారు. అదే విధంగా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే పనులకు సర్వే పూర్తి అయిందని, దాన్ని సాదించేలా కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, జోగురవి, విజయ్, ధోని జ్యోతి, దయాకర్, నగేష్ రెడ్డి, మహేష్ కిరణ్ పాల్గొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మహిళా మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎంపీ గోడం నగేష ముఖ్యతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలను చేతపట్టి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా ప్రతి ఇంటిపై తిరంగా జాతీయ పతకం ఉండాలని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన స్ఫూర్తితోనే మూడేండ్లుగా ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేస్తున్నారన్నారు. ప్రధాని పిలుపుని ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. నేటి యువతరం కొత్త తరానికి స్వాతంత్ర్య చరిత్ర తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 12 నుంచి 14 వరకు జాతీయ పతకాలను ఇంటిపై ఎగరవేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మనంద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ధోని జ్యోతి, నాయకులు ఆధినాథ్, విజయ్, ఆకుల ప్రవీణ్, పద్మ, దయాకర్ పాల్గొన్నారు.

తపాల శాఖ ఆధ్వర్యంలో..

పట్టణంలోని తపాల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. సోమవారం పోస్టాఫీసు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. వాహనాలకు జాతీయ జెండాలను కట్టుకొని నినాదాలు చేస్తూ ప్రధాన విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. వినాయక్‌చౌక్, నేతాజీచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, అశోక్ రోడ్డు మీదుగా తిరిగి కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఎస్పీ సిద్దార్థ, ఏఎస్పీ పుష్పేంద్రకుమార్, పోస్టు మాస్టర్ గంగాధర్, తపాల సిబ్బంది పాల్గొన్నారు.





బొజ్జన్న బువ్వను సద్వినియోగం చేసుకోవాలి

- కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జైవంతరావు



నవతెలంగాణ-ఉట్నూర్

పేదలకు బుక్కెడు బువ్వ పెట్టాలనే గొప్ప సంకల్పంతో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోత్ జైవంతరావు పేర్కొన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న బువ్వ అన్నదాన కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ కార్యాలయానికి సూదుర ప్రాంతాల నుండి అర్జీదారుల కష్టాలను గుర్తించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గతేడాది నుండి బొజ్జన్న బువ్వ కార్యక్రమం చేపడుతున్నారని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే బొజ్జన్న అన్నదానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ విశ్వనాథ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చ దేవానందం, మాజీ మండల అధ్యక్షుడు నర్సయ్య, ఒమేశ్వర్, రాజు, రాజేష్, హనుమంతు పాల్గొన్నారు.

జాతీయ భావం పెంచేందుకే తిరంగా ర్యాలీ



బజార్‌హత్నూర్ : ప్రజల్లో జాతీయ భావం పెంచేందుకు తిరంగా ర్యాలీ చేపట్టినట్లు బీజేపీ మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులు సోమవారం జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతా కీ జై అని నినాదిస్తూ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంటా ర్యాలీ కొనసాగించి శివాజీ చౌక్ వద్ద ముగించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెరుగు సంతోష్, మండల తిరంగా ర్యాలీ కో కన్వీనర్లు కొత్త శంకర్, మడవి ప్రకాష్, ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న, మాజీ ఎంపీటీసీలు గజనంద్, ఈశ్వర్, సోషల్ మీడియా కన్వీనర్ వాగంబర్ జ్ఞానేశ్వర్, నాయకులు కేవల్ సింగ్, ఆల్క గణేష్, తేలి నారాయణ, నానం రమణ, మాజీ సర్పంచ్ నాగరావ్, లక్ష్మణ్, జై కిషన్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఏడు సబ్జెక్టుల్లో శభాష్ అనిపించుకున్న శుభంగి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల బీజెడ్‌సీ విద్యార్థిని శుభాంగి అగర్వాల్ సీపీ గెట్ పీజీ ఫలితాల్లో ఏకంగా ఏడు సబ్జెక్టుల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించింది. అందరితో శుభాంగి శభాష్ అనిపించుకున్నది. వృక్షశాస్త్రంలో 6వ ర్యాంకు, హిందీలో 25, జంతు శాస్త్రంలో 27, ఆంగ్లంలో 57, జర్నలిజంలో 107, ఆర్థిక శాస్త్రంలో 117, రసాయన శాస్త్రంలో 1713 ర్యాంకులు సాధించి ఔరా అనిపించింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో శుభాంగినితో పాటు తండ్రి మనీశ్ చంద్ర అగర్వాల్‌ను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి రాణించాలని ఆకాంక్షించారు. అలాగే కూతురి ప్రారొహిబ్ పట్ల తండ్రి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంగీత, అరుణ్ కుమార్, శ్రావణి, సంతోష్ కుమార్, అష్రఫ్ అలీ, రాజ్ కుమార్, రమేశ్, శ్రీనివాస్ రమాకాంత్ ఉన్నారు.

ఎస్టీఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ఎస్టీఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, కేంద్రం అవలంభిస్తున్న జాతీయ విద్యావిధానం పూర్తిగా కార్పోరేటీకరణ దిశగా ఉందన్నారు. జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని, ఓపీఎస్ సాధనకు అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు హనుమంతరావు, మహిపాల్, శంకరయ్య, బాలక్రిష్ణ, శివానంద పాల్గొన్నారు.